

# స్వాభిమానం

కథానిక

నిట్టల శ్రీరామమూర్తి

చాలా కాలానికి వెళ్ళేను ఆ వూరు. ఆ వూరు తలచుకొన్నప్పుడల్లా మిత్రుడు పృత్యుం జయరావు జ్ఞాపకంవస్తాడు. అతనూ నేనూ చిన్నప్పట్నించీ అక్కడే చదువుకున్నాం. మంచి తెలివితేటలూ, చక్కని విజ్ఞానమూ, ఉన్నత భావాలూ కలిగియుండే అదృష్టంలేక అతి సామాన్యజీవితం గడుపుతూ "రేపు ఎల్లాగడుస్తుంది?" అనే పరిస్థితుల్లో ఆశలన్నీ, సమర్థతనీ చంపేసుకుని జీవించే వ్యక్తుల్లో అతనొకడు. బి. ఏ. వరకూ స్కాలరుషిప్పుమీద చదువుతూ, అన్నీ ఫస్టుక్లాసులో పాసై, చివరకి తాలూకా గుమాస్తాగానే వుండిపోయాడు.

ఆ కేళ్ళయింది. మళ్ళీ ఆ వూళ్ళో అడుగు పెట్టాను. పాపం జయరావు ఎల్లా వున్నాడో? అతని దురదృష్టంగురించి బాధతో నేను చర్చిస్తూంటే "రామం నేను అన్నిక్లాసుల్లో ఫస్టుగావచ్చేను. దరిద్రంలోకూడా మనదేరా ఫస్టు మార్కు" అని జాలిగానవ్వుతూ అతను అన్నమాటలు నన్ను ఎంతో కలవరపెడుతూవుండేవి అతను జ్ఞాపకంవచ్చినప్పుడల్లా.

"జయరావుగారున్నారండి?" అడిగాను.

"జయరావుగారా? ఈ ఇంట్లో లేరండీ, చాలా కాలమై గాంధీనగరంలో వుంటున్నారు. తమరు బంధువులా?" అన్నాడు ఆ ఇంటాయన ఆశ్చర్యాన్ని సూచిస్తూ నన్ను ఎగాదిగాచూస్తూ.

"నా స్నేహితుడు లెండి. వెళ్ళొస్తా" అని ఆయనదగ్గర సెలవుపుచ్చుకుని ఆయనచెప్పిన గుర్తులు ప్రకారంనడిచేను.

కనిపించిన బిల్డింగు చాలా ఆశ్చర్యం కలిగించింది. రేడియోమాదిరిలో చక్కని బంగాళా. చుట్టూ కాంపౌండుగోడా, లోపల పెద్దతోటా, ఇది జయరావు ఇల్లేనా అని సందేహం కలిగింది. తీరా బోర్డుమాసేసరికి ఆ అనుమానమూ తీరిపోయింది. అయితే జయరావు సంపన్నుడయ్యాడన్న మాట. ఎల్లావచ్చిందో సిరి ఏమిటీ సంగతి అనుకుంటూ నేను గేటుముందు తటపటాయిస్తూంటే, అప్పుడే వరండాలోకి వచ్చిన జయరావు నన్ను గుర్తుపట్టి "ఏంరోయ్‌రామం? ఎప్పుడొచ్చావు?" అని తన సహజ ధోరణిలో పెద్దగా కేకలేసుకుంటూ గేటు దాకావచ్చి నన్ను కౌగలించుకుని లోపలకి తీసుకువెళ్ళేడు.

"చాలా కాలానికి కనిపించావురా, ఇప్పుడేం చేస్తున్నట్లు, ఎక్కడుంటున్నావ్, పిల్లలా?" అంటూ గుక్కతిప్పుకోకుండా ప్రశ్నపరంపర కురిపించాడు. నేను అడుగుదామనుకున్న ప్రశ్నల దొంతర నామనస్సులోనే అణగిపోయింది. ఇద్దరం సోఫాల్లో కూర్చున్నాం. ఎదురుగుండా తోట మధ్యని నగ్నస్త్రీ పాలరాతి విగ్రహం, దాన్ని పెనవేసుకుని నాల్కలుచాచిన పాముబొమ్మా మెరుస్తున్నాయి ఆకుపచ్చని వాతావరణంలో. జయరావు 'మాం' మాట్లాడేస్తున్నాడు ఆప్యాయంగా. అతను చిన్నప్పటినించీ మంచిమాటకారీ, బాయిలా మనిషీనీ.

జయరావు మారలేదు. అతని ఐశ్వర్యం అతనికి ఏవిధమైన అహంభావం కలిగించకపోడం అతని విజ్ఞానంలోని నా నమ్మకను బలపరిచింది. జయ

రావుకేసి చూస్తున్నాను. నిజమే, జయరావు ఏం మారలేదు. మునపటిలాగే సన్నంగానే వున్నాడు శ్రీమంతులకి సహజమైన 'వొళ్లు' రాలేదు. పెంపలు నగంనగం నెరుస్తున్నాయి. కళ్ళల్లో గాంభీర్యం, దేనికోసమో వెతుకుతూన్నట్లు తృప్తిలేనట్లు తోపించేచూపులూ, సామాన్యపు డ్రెస్సూ— చూస్తూంటే అతను సంపదలో వుండీ కూడా దానికి అంటుకుండా మానసికంగా ఏదో బాధ పడుతున్నట్లే కనిపించేడు. ఈ భోగాలన్నీ తనకు ఏమాత్రమూ యిష్టములేనట్లూ, అవి అంటే చీదరించుకున్నట్లుకూడా అనిపించింది అతని ధోరణి చూస్తుంటే.

"లే, స్నానంచేసి భోంచేసేక తాపీగా కూర్చుందాం" అంటూ తను ఏర్పాట్లన్నీ చేసే ప్రయత్నంలో బడ్డాడు జయరావు. తోటలోని పాలరాతి విగ్రహంలోని పెదవులమీది చిరునవ్వూ, కళ్ళల్లోని తీవ్రతా అనుబంధించిన శిల్పి ప్రజ్ఞను వూహించుకుంటూ చుట్టకాలుస్తూ కూర్చున్నాను.

రాత్రి తొమ్మిదై వుంటుంది. డాబామీద కూర్చున్నాం. తోటలోని క్రోటన్సు, నైటు క్వీనూ గుప్పుమని సువాసనలు వెదజల్లుతున్నాయి. మధ్యమధ్యని 'గుంయి'మని కీటకములచప్పుడూ, దూరంగా "మాదాకాళం అమ్మా" అన్న కేకలూ వినిపిస్తున్నాయి. ఆవేళ అమావాస్యమూలాన్ని చంద్రుడు సెలవుచ్చుకున్నాడు. చుట్టూ చిక్కని చీకటి. పైన గంభీరమైన నల్లటి ఆకాశంలో నక్షత్రాలు మిణుక్కు-మిణుక్కు-మంటూ ఏమిటో గుచ్చి గుచ్చి అడుగుతూన్నట్లున్నాయి. తివాసీమీద వెల్లకిలపడుకుని చుట్టుప్రక్కలఅంతా మర్చిపోయి ఆకాశంకేసి కేంద్రీకరించి చూస్తున్నాను. ఆకాశం తన అంతటి వైశాల్యంతోటీ గాంభీర్యంతోడీ నా గుండెల్ని అదిమినట్లనిపించింది నాలో ఏదో తియ్యనిబాధ కలిగించింది.

"ఎంతచక్కని ప్రకృతి!" అన్నాను వున్నట్టుండి. జాలిగా వెకిలిగా నవ్విన జయరావు నవ్వు వినిపించింది. తలెత్తి అతనికేసి చూశాను.

"ఈ సుందరప్రకృతిలో నువ్వు నిలవలేవు. ఈ వినీల మనోహర ఆకాశంలో ఎన్ని విమానాలు కూలి, ఎందరు మరణించారో? సముద్రకెరటాల మీంచి గెంతుకుంటూ వెళ్ళి వాటి నురుగల్లో తేలగాటాలాడాలనుకుంటావు. ఆ కెరటాలక్రింద ఎంత అగాధముందో? ఎన్ని సుడిగుండాలున్నాయో? దేదీప్యమానమైన సూర్యుణ్ణి సమీపించాలనుకుంటావు కొద్దినిమిషాల్లోనే ఆ ప్రచండ వేడిలో మాడిపోతావు. బాహ్య సౌందర్యపు వ్యామోహంలో పడకు" అన్నాడు.

"ఏమిటి ఈ అసంతృప్తి?" అన్నాను.

అతని వరస చూస్తూంటే జీవితంలో ఏదో పెద్ద దెబ్బతిన్నవాడిలా కనిపించాడు.

"అయితే చెప్తాను విను." లేచి కూర్చున్నాడు. సిగరెట్టు ముట్టించాడు.

"నేను చెప్పబోయేదానితో నీవు నన్ను అడగాలనుకున్న అన్ని ప్రశ్నలకీ సమాధానం వస్తుంది."

నాకు సిగరెట్టు యివ్వబోయాడు. వద్దంటూ లెదరు కేసులోంచి ఓ చుట్టతీసి వెలిగించాను.

"మా అన్నయ్యని నువ్వు ఎరిగేవుంటావు." ఉపక్రమించేడు జయరావు.

"ఆఁ ఎరక్కేం. ఈ వూరికంతా తీసింగు లాయరుకదూ...మీ వదినె..."

"అవును నువ్వు అనటానికి సందేహించనక్కర్లేదు. మా వదినె ఒక్కతానీ బయటికి పోనిచ్చేది కాదు. నాచదువుకీ, ఉద్యోగానికీ ఎంతో సహాయం చేద్దామనుకునీకూడా ఏం చేయలేకపోయేవాడు మా అన్నయ్య. ఇప్పుడు ఆవిడగురించే చెప్పదల్చుకున్నాను. మా వదినె చాలా అందంగా వుండేది. ఆమె సౌందర్యాన్ని చూసే మా అన్నయ్య పల్లెటూరిపిల్లైనా, పెద్దచదువులేకపోయినా, ఆమెనే పెళ్ళిచేసుకున్నాడు. కాని మా అన్నయ్యకూడా నీలాగే మోసపోయాడు. బాహ్యసౌందర్యాన్ని చూసి ఆమె మనస్సుకూడా అంత మృదువుగా, సరళంగా, విజ్ఞానంతో వుంటుందనుకున్నాడు. కాపరానికొచ్చిన నాలుగు నెలలకే ఆవిడ తత్వం బయటపడింది. ఆమె ఏదికావాలంటే అది అయిపోవాలి. చాలా మంకుపట్టుపట్టేది అనుకున్నపని అయిందాకా. ఆవిడ పుట్టింటివారుకూడా సంపన్నులవటంమూలాన్ని చిన్నప్పట్నించీ అతిగారాబంగా, అతిముద్దుగా పెరిగింది. ఆవిడ అడిగిందే తడవుకొండమీది కోతిని తీసుకువచ్చేవారు. ఆవిడ పసితనంలో- బూరాలు కావాలంటే బూరాలు కొనేవారు...వాటిని వెంటనే నూతుల్లో పొడిచి

పగలకొట్టేసేది. వెంటనే ఇంకా కావాలంటూ పట్టుపట్టేది. చదువుకున్నప్పుడూ అంతే! తను ఎప్పుడూ వెనకబడి వుండేది. బాగా మార్కులు వచ్చిన పిల్లల్ని చూస్తే కిట్టేదికాదు. వాళ్ళ పుస్తకాలు చింపేసి, కణికెపుల్లలు దాచేసి ఏమీ ఎరగనట్లు కూర్చునేది. బట్టలు సరీగ్గా తొడగలేదని అక్కయ్యని గిల్లి పైగా అక్క తనని గిల్లిందని తండ్రితో ఫిర్యాదుచేసేది. కావాలన్నది వెంటనే ఇవ్వకపోతే తలుపులు బద్దలుకొట్టి కనిపించిన వస్తువులు నాశనంచేసి, పెద్ద ఏడుపుతో ఎంతో మారాము చేసేది. ఇంతకీ చెప్పేదేమిటంటే ఆమె ఎంతెంత అల్లర్లు చేసినా, ఆమె అతి మనోహరమైన మొహంచూసేసరికి ఎవరూ ఏమీ అనలేకపోయేవారు. ఆ సౌందర్యానికి ముగ్ధులైపోయేవారు." జయరావు ఆగి గ్లాసుడు మంచినీళ్ళు త్రాగి మళ్ళా మొదలెట్టాడు-

"ఆమెకి తన అందానికి ఎంత ప్రభావముందో కూడా తెలుసు. అది తన స్వలాభానికి ఎంతగానో వినియోగించుకునేది. ఓరోజున ఇంట్లో పాము వచ్చింది. నలుగురూ పోగై చంపేసారు. ఆ చంపుతూన్నంతసేపూ, ఆ పగిలిన పాముతలని ఎంత కసిగా చూసిందనుకున్నావ్ ఆ పదేళ్ళ పిల్లానూ? ఆ సౌందర్యంలో అంత కార్పణ్యం ఎలా ఇమిడిందా అని ఎంతో ఆశ్చర్యమేస్తుంది."

తోటలోని విగ్రహాన్ని తల్చుకుని నావళ్లు జలదరించింది. జయరావు ఇంకో సిగరెట్టు వెలిచాడు. పెద్దగుక్కల్తో మూడుసార్లు పీల్చి మళ్ళీ అందుకున్నాడు.

"కాస్త జ్ఞానంవచ్చేక అందరిమీదా అధికారం చలాయించేది తండ్రికంటేకూడా. ఓసారి తను రమ్మనగానే రాలేదని దాసీపిల్లని చితగ్గొట్టి పైగా తండ్రితోచెప్పి దాన్ని పనినుండి మానిపించేసింది. ఇంక రైతులు మక్తాలు వసూలు యిస్తూంటే పూర్తిగా అణా పైసలతో రాబట్టించేది వాళ్లు నాశనమైపోయే పరిస్థితుల్లో వున్నప్పుడుకూడా. తండ్రికి ఆమె ఎంతచెప్తే అంత. చిన్నప్పటినించీ తనకే నగలు కావాలనీ, సొమ్ము దాచుకోవాలనీ, అక్కకీ వాళ్ళకీ లేకుండాచేయాలనీ ఎంతో అభిలాషపడి తన కోరిక నెరవేర్చుకునేది. ఆ స్వార్థం, ఒకళ్ళని బాధపెట్టి చూసి సంతోషించడం ఆమె తత్వంలోనే జీర్ణించిపోయేయంటే ఎవరూ నమ్మేవారుకారు. ఆవిడ ధోరణి అర్థంచేసుకుందికి మా అన్నయ్యకి అట్టే రోజుల పట్టలేదు. మా అన్నయ్య సంగతి నీకు తెల్సే వుంటుంది. మంచితనం అంతా అతనిలో మూర్తీభవించియుండేది. ఆవిడ ఏంకావాలన్నా తీసువచ్చేవాడు ఏం చెయ్యాలన్నా చేసేవాడు. కాదంటే ఇంట్లో నానా రసాభాసాచేసి తనకి మనశ్శాంతిలేకుండా చేస్తుందని అతనికి తెలుసు. సాధ్యమైనంతవరకూ సరిపెట్టుకు పోయేవాడు. ఒకటిరెండుసార్లు, అయిపోగానే ఫేసుపౌడరు తేలేదనీ, తను బంగాళదుంపలు తెమ్మంటే అరటికాయలు తెప్పించాడనీ ఇంట్లో నానా అల్లరి చేసింది. ఆవిడతో సినీమాకని, వచ్చిన పార్టీల్ని పంపించేసిన రోజులుకూడా వున్నాయి. నాకు సహాయంచేయలేకపోతున్నానే అని చాలాబాధపడేవాడు. మంచితనానికి కూడా హద్దుంది. అపాయపరిస్థితుల్లో కుండేలుకూడా ఎదుర్కొంటుంది. అన్నాళ్ళూ అలా మనశ్శాంతిలేకుండానే తన అవసరాల్ని చంపుకుని జీవితం గడిపిన అన్నయ్య ఆరోజు ఆవిడ ఆస్థి అంతా తనపేర వ్రాసెయ్యమనటంతోటే ఎంతో చికాకుపడ్డాడు.

"ఆస్థిఅంతా తమ్ముడికి రాసేద్దామనుకుంటున్నారు కాబోలు! ఈ నాకంఠంలో ప్రాణం వుండగా అది జరగదు", అన్నది.

"అతని కా ఆలోచనేలేదు అంతవరకూ. లేనిపూహాలు తనకి అంటగడుతూ కాని మాటలు తనని అంటూంటే అతనికి కోపంవచ్చింది.

"చాలు నోర్మూయ్" అనేసాడు.

ఆవిడ జీవితంలో ఎదురుమాట పడ్డం అదే మొదటిసారి. తోకత్రొక్కిన త్రాచులా లేచింది. ఆవిడకి అనుకున్నదల్లా ఎప్పటికప్పుడు జరిగిపోతూండడం మూలాన్ని, కాదన్నా, అడ్డుతగిలినా, పనికిరాదన్నా ఎల్లా సరిపెట్టుకోవాలో తెలిసిరాలేదు. ఎదురుగుండా వున్న అతను తన భర్త అనీ, తనూ కొంత తమాయించుకుని సబబుగా మసలాలనీ తోచలేదు. నానామాటలూ అని పుట్టింటికి వెళ్ళిపోయింది. మళ్ళీ ఓ ఏడాదిదాకా ఒహరిమొహం ఒహళ్లు చూసుకోలేదు. వాళ్ళకి

పిల్లలు లేకపోవటం మూలాన్ని పరిస్థితులు మరీ విషమించేయి. ఇద్దరూ పెంకిపట్టుపట్టేరు. చివరకి నేను అన్నయ్యతో ప్రాధేయపడ్డాను. ఆరోజు నాకింకా జ్ఞాపకం వుంది. సాయంత్రము "ఆరు" అయివుంటుంది. తోటలోని విగ్రహాన్ని నువ్వు చూసే వుంటావు. అది మా అన్నయ్య కట్టించిందే. ఆ రోజుకి కట్టడం పూర్తిఅయి మా అన్నయ్య దానికేసి చూస్తూ నిల్చునివున్నాడు. అస్తమించే సూర్యకాంతిలో ఆ పాలరాతి విగ్రహం రక్త రంజితమైంది. "నాకోసం వదినెతో తగువు పెట్టుకోకు రమ్మని వ్రాయి" అన్నాను. అతను చిలిపిగా నవ్వేడు. మళ్ళీ విగ్రహంకేసీ, సూర్య బింబంకేసీ చూసేడు. ఏదో నిశ్చయానికి వచ్చిన వాడిలా గబుక్కుని "అయితే రాయమంటావా జయం?" అన్నాడు.

"ఊఁ తప్పకుండాను" అన్నాను.

"సరే" అంటూ ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడే అన్నయ్య వుత్తరం రాసేడు "నా ఆస్థియంతా నీదే. కావలిస్తే వీలు రాస్తాను. వచ్చి నాదగ్గర వుండు." అని.

ఆమె చాలా సంతోషించింది, చిన్నప్పుడు తండ్రి బూరా కొనిపెడితే ఎంత సంతోషం కలిగిందో అంత సంతోషమూ కలిగింది ఆవిడలో. అన్నయ్యగారింటికి వచ్చేసింది. అన్నయ్య ఆ రోజుల్లో చాలా హుషారుగా వుండేవాడు. చిలిపితనం చిన్నప్పటి కొంటెతనం అతనిలో అవుపించేయి. భార్యఅంటే ఎంతో ప్రేమ చూపించేవాడు. ఆవిడనోట్లో మాట నోట్లోవుండగా అన్ని పనులూ జరిగించేవాడు. అతని ఆకస్మాత్తు మార్పు ఎవరికీ అర్థం కాలేదు. జీవితసౌఖ్యం అంతా కొద్దిరోజుల్లోనే అనుభవించేసి ఎక్కడికో వెళ్ళిపోయేవాడిలా కనిపించేడు."

జయరావు ఆగేడు. చెమ్మగిలిన అతనికళ్ళు మెరుస్తున్నాయి చుక్కలకేసి చూడ్డం మానేసి అతని కళ్ళకేసి చూసేను. సగం కాలి ఆరిన సిగరెట్టును అవతల పారేసి బొంగురు గొంతుకతో బరువుగా మళ్ళీ చెప్పటం మొదలెట్టేడు—

"రోజులు మామూలుగానే జరిగిపోతున్నాయి. ఆవిడ అన్నయ్యకేసి అస్తమానం అనుమానంగా చూస్తుండేది. ఓరోజున అన్నయ్య నవ్వుతూ అన్నాడు. "నేను విల్లు రాసేసేను. ఆస్థి అంతా నా అనంతరం నా తమ్ముడికే చెందుతుంది" పిడుగులాంటి ఆ మాటలు వినగానే ఆవిడ విస్తుపోయింది. "నన్నిలా మోసంచేసి తన ఆశలతో చెలగాటా లాడేరన్న మాట" ఆవిడ అభిమానానికీ, అభిజాత్యానికీ చెంపపెట్టుగా వినిపించేయి ఆ మాటలు. తన భర్త వుట్టి అమాయకుడే అనుకుందిగాని తన్నిలా మోసంచేస్తాడని అనుకోలేదు. ఒక్కసారి అతనిమీద చెప్పలేని అసహ్యం వేసింది. అది క్రమంగా వుడుకుబోతుతనంగా మారింది. మొదటి నాలుగురోజులు భోరున ఏడ్చింది. "తనేం చేసిందని, తన భర్త తన్నిలా ఎడిపించటం" ఆఖరికి ఆవిడ భర్తమీద కత్తి కట్టింది. అతనిమీద పగ, ద్వేషం బయలుదేరేయి. "తను పుట్టినతర్వాత ఎదురుమాట వినలేదే తన్నిలా నగుపాటు చేస్తాడా?" దానికితగిన ప్రాయశ్చిత్తం చేయాలనుకుంది. తనకి అతను శత్రువుగా కనిపించేడు. భర్త అనే మాటే మర్చిపోయింది. ఆవిడకి ఒక్కటే లక్ష్యం అతనికి బుద్ధిచెప్పటం. అహర్నిశలు ఆవిడది ఒక్కటేప్రయత్నం అతన్ని పరాభవించటం. ఈ ఆలోచనలో తనభర్త అని గాని, అతనికేం అపాయం కలుగుతుందని కాని మారు ఆలోచనలేకపోయింది. ఆవిడ అనుకున్నది అయిపోతేనే ఆవిడకి మనశ్శాంతి... అతనికి... విషం పెట్టింది."

"ఆఁ" తెల్లబోయాను. "అంత ఘోరమే?"

"ఎందుకల్లా ఆశ్చర్యపడతావు రామం. ఈ ప్రపంచంలో జరగని ఆశ్చర్యమేముంది? కలలో నైనా మనం వూహించలేని దారుణాలు జరుగుతున్నాయి. మానవస్వభావం అల్లాంటిది. రోజూ పేపర్లో చూట్టంలే. తండ్రి కొడుకులమధ్యా, అన్నదమ్ముల మధ్యా హత్యలూ, కొట్లాటలూ, కోడళ్ళి చెరచబోయే మామలూ—"

"ఆ తర్వాత ఏమైంది?" అన్నాను నాకు తెలీకుండానే ఇదివరకే ఆరిపోయిన చుట్టని అవతల పారేస్తూ.

"అన్నయ్య వెంటనే తెలుసుకొన్నాడు. ఇంక ప్రాణాలు అట్టేసేపు నిలవ్వు. 'నాకు విషం పెట్టేవా' అన్న ఒక్కమాట అనగలిగాడు ఆవిడకేసి జాలిగా ప్రేమగా చూస్తూనే. అతని కళ్ళల్లో

ఆవిడ మూర్ఖత్వానికీ అజ్ఞానానికీ సాక్షీభూతి మాత్రమే కనిపించింది. ఇంక క్షణాలమీద వుంది జీవితం. 'కాయితం పెన్నూ తీసుకురా' అన్నాడు ఆమెకి చాలా భయమువేసింది. తనని జైల్లో పెట్టరుకద? బొమ్మలాగ నడిచివెళ్ళి కాయితం పెన్నూ తీసుకువచ్చింది. అతను నాలుగుముక్కలు రాశాడు. 'జీవితంమీద విరక్తిచెంది ఆత్మహత్య చేసుకుంటున్నాననీ, దానిలో ఎవరికీ ఏమీ బాధ్యత లేదనీ' సంతకంపెట్టిన అయిదు నిమిషాలకే అతను గిలగిల తన్నుకుని ప్రాణం విడిచేడు. అతను పోయేవరకూ అతని మొహంమీద విజయ సూచకమైన చిరునవ్వు వుండిపోయింది. ఆ చిరునవ్వు ఆమెకి అర్థంకాలేదు. చిన్నప్పుడు పాముని చంపుతూన్నప్పుడు ఎల్లా చూసిందో అలాగే చూసింది పోతూన్న అన్నయ్యకేసి. తనేమవుతానసే భయంతప్ప తన భర్తపోయాడన్న స్పృహే లేదు. కాయితం చదువుకుని సంతోషించింది. తన్నింక ఎవరూ ఏమీ అనలేరు. ఆస్థి పోతేనే తనని 'బాధించిన' వ్యక్తిపై తగిన ప్రతీకారం తీసుకుంది.

అన్నయ్య పోయిన తర్వాత అతని ప్యాకెట్టులో విల్లు చూసుకుంది వదిన. ఆ విల్లు చూసీ చూడడంతోటే కొయ్యయి పోయింది. ఆ విల్లు ప్రకారం అతని యావదాస్థులూ ఆమెకే సంపూర్ణ హక్కుల్తో చెందజేసేడు! ఆవిడ మొదట నమ్మలేక పోయింది. మళ్ళీ చదువుకుంది. ఆస్థి అంతా తనకే! 'ఎంత దారుణం జరిగింది. తనతో అలా ఎందుకు చెప్పేరు? తన స్వార్థంతో, దురాశతో ఆయన చెలగాటం ఆడేరు. చివరికి ఆయనే జయించారు. ఎంత వుదారం చూపేరు' ఒక్కసారి ఆవిడలో చెప్పలేని మార్పు వచ్చింది. ఆవిడ స్వభావమే మారిపోయింది. ఆవిడ చేసిన దుర్మార్గం ఆవిడ కళ్ళెదుట నాట్యం చేయటం మొదలెట్టింది. తన నడత అంతా జ్ఞాపకం వచ్చింది. కుమిలి కుమిలి ఏడ్చింది హృదయం కరిగి నీరయ్యేటట్లు. నవ్వుతూనే తన భర్త తనకి తగిన శిక్ష విధించేరు. తను వున్న పళంగా చనిపోతే బాగుండును. ఎవరేనా తనని ముక్కలుముక్కలుగా కోసేస్తే తనకీ బాధవుండదు ఎవరితో చెప్పగలదు తన లోని ఆవేదన? ఎల్లా తీరుతుంది తన మనస్సులోని క్షోభ? దిగాలుపడిన మనస్సుతో భర్తని తల్చుకుంటూ క్రుంగిపోయింది. అన్నయ్యపోయిన నెల తిరక్కుండానే ఆవిడ అతన్ని అనుసరించింది ఆస్థిఅంతా నా పేర వ్రాసి." ముగించాడు జయరావు. అతని గొంతు బాధతో, ఆవేదనతో గద్గదస్వరమైంది. కన్నీళ్ళలో తేలియాడే అతని కన్నుల్లో తీరని దుఃఖం ప్రవించింది. ఆఖరికి అన్నాడు "అందుకే నాకీ ఐశ్వర్యాలపై ఆసక్తిలేదు. గుమాస్తాగా వున్నప్పుడు తిండిచాలక పోయినా మనశ్శాంతేనా వుండేది. ఇప్పుడు అన్నీ వున్నా మనశ్శాంతి లేదు. ఈ సంపదలన్నీ వాళ్ళిద్దరినీ జ్ఞాపకానికి తెచ్చి వాళ్ళ విషాద జీవిత ఫలాన్ని నేను ఎలా అనుభవించగలననే నిస్పృహ నాలో కలిగిస్తున్నాయి. నీకు వుత్తరం రాద్దామనుకున్నాను. కాని నువ్వు ఆరేళ్ళనించీ మిలిటరీలో వుత్తర హిందూస్థానంలో ఎక్కడో వున్నట్లు తెలిసింది."

ఇద్దరం మౌనంగా చాలాసేపు అట్టే వుండిపోయాం. పైన నక్షత్రాలు గుచ్చిగుచ్చి ఏమిటో ప్రశ్నిస్తూనే వున్నరు. వినీలాకాశం సుందరంగానే కనిపించింది. క్రోటన్సూ, నైటుక్వీనూ యథావిధిగా తమ సువాసనల వెదజల్లుతూనే వున్నాయి. మాకు నిద్రబట్టింది. కాని మా మనస్సులు చెప్పలేని బాధతో, ఏదో ఆవేదనతో చీకటిలో అలుముకుపోతూ, ఎక్కడికో ఎగిరి పోతున్నాయి- నక్షత్రాలు ప్రశ్నించే కాంతులకి సమాధానంకోసం వెతుక్కుంటూ.

---

ఇంద్రియాలవల్ల పొందకలిగే ఆనందం క్షణభంగురం. హృదయానందం చివరికి మనకి దుఃఖాన్నే కల్గిస్తుంది. మనస్సుపొందే ఆనందం ఒక్కటే కడసారి కనుమూతవరకూ మనతో వుంటుంది.

—స్పెయిన్‌దేశపు సామెత